

ఎస్సీ వర్గీకరణ అమలుకు లక్ష డప్పులు, వేల గొంతులు పోస్టరును ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ, తదితరులు

7న చలో హైదరాబాద్

లక్ష డప్పులు, వేయి గొంతుకలు

- ఎల్బీ స్టేడియం నుంచి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన, ర్యాలీ, సభ

పంజాగుట్ట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమానికి రాష్ట్రంలోని మాదిగలంతా తరలిరావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్)వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు, వేల గొంతుకలు ప్రదర్శన పోస్టరును ఆయన వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. చలో హైదరాబాద్ పేరుతో ఎల్బీస్టేడియం నుంచి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన, ర్యాలీ ఉంటుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వ పాలసీలను త్వరగా అమలు చేయాలని సీఎంకు గుర్తు చేస్తున్నామని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, అక్కడ లేని అడ్డంకులు ఇక్కడ ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు తమ మద్దతును ప్రకటించడమే కాకుండా తాము పాల్గొంటామని అన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పృథ్వీరాజ్ యాదవ్,సీనియర్ పాత్రికేయుడు ఇస్మాయిల్,ఎంబీసీ నాయకుడు సత్యనారాయణ,రవి, అనంద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ,వెంకన్న మాదిగ పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మాదిగ జాతి గౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి మందకృష్ణ

- ఎంపీ ఈటల రాజేందర్

పంజాగుట్ట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మాదిగ జాతి గౌరవాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ నిలబెట్టారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మంద కృష్ణ మాదిగను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సన్మానించారు. రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి అన్నంపెట్టే ప్రజలకు అండగా, సంపద సృష్టించి అన్నింటికీ దూరమైన జాతి మాదిగ జాతి అని ఈటల రాజేందర్ అన్నారు. ఎన్ని నిర్బంధాలు అడ్డొచ్చినా వెరవని వ్యక్తి మందకృష్ణ మాదిగ అని అన్నారు. దేశ అత్యున్నత పురస్కారం పద్మశ్రీకి ఆయన ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. జాతి గౌరవం, ఐక్యతను ఆయన నిలబెట్టారన్నారు. జాతి కోసం సుదీర్ఘంగా నెల్సన్ మండేలా కొట్లాడారని, ఇక్కడ మంద కృష్ణ అణగారిన బిడ్డల గొంతుకయ్యారని అన్నారు.

పార్కింగ్ చేస్తుండగా కారులో మంటలు

- రెస్టారెంట్, వాలెట్ పార్కింగ్ నిర్వాహకులపై ఫిర్యాదు చేసిన సినీ దర్శకుడు



దగ్ధమైన కారు

బంజారాహిల్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేస్తుండగా సినీ దర్శకుడికి చెందిన కారులో మంటలు చెలరేగి కాలిపోయింది. రెస్టారెంట్, వాలెట్ పార్కింగ్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే తన కారు కాలిపోయిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగరానికి చెందిన మహ్మద్ కురానా సమీర్ హుస్సేన్ సినీ దర్శకుడు. ఈ నెల 27న ఆయన ఫిలింనగర్‌లోని ఇండియన్ కిచెన్ రెస్టారెంట్‌కు స్నేహితులతో కలిసి తన స్కోడా కారులో వెళ్లారు. రెస్టారెంట్ బయట వాలెట్ పార్కింగ్‌లో ఉన్న వ్యక్తి తాళం ఇచ్చి కారును పార్కింగ్‌లో పెట్టాలని కోరాడు. అరగంట తర్వాత హోటల్ మేనేజర్ సంజనా వచ్చి కారులో మంటలు చెలరేగాయని వారికి తెలిపింది. సమీర్ బయటకు వచ్చి చూడగా కారు రెస్టారెంట్ పార్కింగ్‌లో కాకుండా కేబీఆర్ వాకింగ్ పాత్‌లో ఉంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. రెస్టారెంట్, వాలెట్ పార్కింగ్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని పేర్కొంటూ సమీర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో 'సైబర్' మోసం

- విద్యార్థిని నుంచి రూ.1.68 లక్షలు కాజేసిన నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చదువుకుంటూ పార్ట్‌టైం చేసి సంపాదించుకోవాలని ఆశపడిన విద్యార్థినికి మాయమాటలు చెప్పిన సైబర్ నేరగాళ్లు పెట్టుబడి పేరుతో రూ.1.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ఓ విద్యార్థిని పార్ట్‌టైం ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వెతికింది. ఈ సమయంలో సైబర్ నేరగాడు ఫోన్ చేసి, రెస్టారెంట్లకు రివ్యూలు ఇచ్చే పార్ట్‌టైం ఉందని చెప్పాడు. టాస్కుల పేరుతో సూచించిన రెస్టారెంట్‌కు ఆన్‌లైన్‌లో రివ్యూ ఇచ్చి ఆ రివ్యూ స్ర్కీన్‌షాట్‌ను సూచించిన నంబర్‌కు షేర్ చేస్తే రోజుకు రూ.159 నుంచి రూ.6 వేల వరకు సంపాదించవచ్చని చెప్పాడు. ముందుగా కొన్ని టాస్కులు ఇచ్చి పూర్తి చేసినందుకు రూ.159 పంపి, బ్యాంకు ఖాతాలతోపాటు పూర్తి వివరాలు సేకరించాడు. తర్వాత కొన్ని టాస్కులు పూర్తి చేస్తే వీఐపీ గ్రూప్‌లో చేరవచ్చని, ఇప్పుడు టాస్క్‌కు రూ.100 వస్తే, వీఐపీ గ్రూప్‌లో చేరితే టాస్క్‌కు రూ. 200 చెల్లిస్తామని చెప్పాడు. సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా విద్యార్థిని టాస్కులు పూర్తి చేసి వీఐపీ గ్రూప్‌లో చేరింది. వీఐపీ గ్రూప్‌లో పనిచేసేందుకు పెట్టుబడి పెట్టాలన్న నిబంధన పెట్టిన సైబర్ నేరగాళ్లు ముందుగా రూ. 1000 వసూలు చేశారు. టాస్కులు పూర్తి చేస్తే రూ. 1300 ఇచ్చారు. తర్వాత రూ. 2 వేలు వసూలు చేసి 2800 ఇచ్చారు. తర్వాత టాస్క్ చేసే సమయంలో ఎర్రర్ వచ్చిందని రూ. 9 వేలు కట్టించుకున్నారు. ఇలా పలు దఫాలుగా విద్యార్థినికి మాయమాటలు చెప్పిన సైబర్ నేరగాళ్లు రూ.1.68 లక్షలు వసూలు చేశారు. ఇప్పటివరకు కట్టిన డబ్బు తిరిగి తీసుకోవాలంటే మళ్లీ డబ్బులు కట్టాలని డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధిత విద్యార్థిని సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. పెళ్లి పేరుతో వంచన

- యువతిని మోసం చేసిన సినీ డ్యాన్సర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసగించిన సినీ నృత్యకారుడ్ని రేప్ కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పల్‌కు చెందిన లకావత్ రాము (24) సినిమాల్లో డాన్సర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి రెండేళ్ల క్రితం శ్రీకృష్ణనగర్‌లో ఉంటూ సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తున్న యువతితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరు తరచూ కలిసేవారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అయితే ఇటీవల కాలంలో పెళ్లి మాట ఎత్తేసరికి రాము ముఖం చాటేసాడు. తాను మోసపోయానని తెలుసుకొని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అత్యాచారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ప్రారంభించిన జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడు రామును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇక్కడ నడిస్తే.. దీర్ఘాయువే!

- ఔషధ వనంలో వందలాది రకాల మొక్కలు
- చిన్నారుల విజ్ఞానం పెంచుతూ ప్రత్యేక ఆట ప్రాంగణాలు
- జూబ్లీహిల్స్‌లో ఆకట్టుకుంటున్న హెర్బల్ పార్కు



జూబ్లీహిల్స్ హెర్బల్ పార్కు



ఔషధ మొక్కలు

బంజారాహిల్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పచ్చదనం శోభిస్తే.. ప్రకృతి పులకిస్తుంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ పుణ్యమా అని వాతావరణం కాస్తా కాలుష్యంగా మారుతోంది. గాలి పీల్చాలంటేనే భయపడే పరిస్థితి. దీనికితోడు కాంక్రీట్ జంగిల్‌లా మారిన నగరంలో పచ్చదనమూ కరువవుతోంది. ఈ పరిస్థితుల్లో జూబ్లీహిల్స్‌లో ఉన్న ఔషధ సుగంధవని ఆరోగ్యప్రదాయనిగా మారింది. చల్లని గాలులే కాదు.. ఆరోగ్యాన్ని పంచే అద్భుతమైన మొక్కలూ ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ఇందులో నడిస్తేచాలు దీర్ఘాయువు ప్రాప్తిస్తుంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబరు 10లో 2004లో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో ఔషధ సుగంధవనం (హెర్బల్‌పార్కు)ను జీహెచ్‌ఎంసీ ఏర్పాటుచేసింది. పలు ఔషధ మొక్కలను నాటి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అందులో భాగంగానే దాదాపు 143 రకాలకు పైగా ఔషధాల మొక్కల్ని ఇక్కడ పెంచుతున్నారు.

ఎన్నో వనమూలికలు..

తులసి రకాలు, నేలవాము, ఎర్రచందనం, చందనం, రణపాల, పాలగడప, ఎర్ర చిత్రమూలం, నందివర్ధనం, విషముష్టి, జాజిమాలతి, కిత్తనార, అమృతవల్లి, కలబంద, పొగడ, అరటి, కాచు, వేప తదితర రకాల మొక్కలన్నింటినీ ఇక్కడ గుర్తించవచ్చు. ప్రతి మొక్క వద్దా దానికి సంబంధించిన పేరు, శాస్ర్తీయనామం, ఆ మొక్కలోని ఏయే భాగాలు ఔషధగుణాలు కలిగి ఉంటాయి.. ఎలాంటి వ్యాధుల నివారణకు వాటిని ఉపయోగిస్తారనే వివరాలను పొందుపర్చారు.

కాసేపు నడకతో కొత్త ఉత్సాహం

ఈ ఔషధ సుగంధ వనం చాలా మందికి ఆరోగ్యాన్ని పంచే పార్కులుగా మారాయి. ఈ పార్కుల పక్కన ఉండే నివాసాల వారు దీన్ని ధ్రువీకరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక సాగించే వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఈ పార్కులు ఆరోగ్య ప్రదాయనిగా ఉపయోగపడుతోందని చెబుతున్నారు.

మరిన్ని పార్కులు..

హెర్బల్ పార్కుల పట్ల ఆసక్తి కలిగించేందుకు అర్బన్ ఫారెస్ర్టీ శాఖ మరిన్ని ఔషధ మొక్కల పార్కులను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉంది. స్థానికుల అభిప్రాయాలకు విలువనిస్తూ పలు పార్కుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేసింది. అయితే నిధులతో పాటు జీహెచ్‌ఎంసీ అనుమతిస్తేనే ఇది సాధ్యమవుతుంది. సాధారణ పార్కుల్లో అందమైన మొక్కల చెంత ఔషధ చెట్లను పెంచుతున్నారు. నెల క్రితం హరితహారంలో కూడా వేప, తులసి లాంటి మొక్కలను అధికంగా పంచారు. మామిడి, దానిమ్మ లాంటి చెట్లలో కూడా ఔషధ గుణాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

పిల్లల కోసం..



ఆటల వివరాలతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

ఔషధ మొక్కల ప్రత్యేకతను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా అధికారులు చిన్నారులను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ఆలోచించారు. పిల్లలు నిత్యం ఆడుకునే స్నేక్ అండ్ ల్యాడర్, లూడో, మేజ్, హ్యాండ్స్ అండ్ ఫీట్ తదితర ఆటలను ఇక్కడ భౌతికంగా ఏర్పాటు చేశారు. చెస్ ఆడాలంటే పిల్లలు కాయిన్స్ వాడకుండా వారే అందులో లీనమై ఆడేలా సిద్ధం చేశారు. తద్వారా స్కూల్, కళాశాల విద్యార్థులు ఇక్కడకు వచ్చి ఆడుకుంటూ.. ఔషధ మొక్కల గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలా సేదతీరేందుకు బండరాయిని మెట్ల మార్గంగా మార్చి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

ఔషధ మొక్కల పెంపకంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అశ్వినీ లే అవుట్‌లో ఉన్న పార్కు తలమానికంగా ఉండేలా చర్యలు చేపట్టాం. ఇక్కడ అభయారణ్యాల్లో లభించే చెట్లను కూడా అందుబాటులో ఉంచాం. మొక్కలు చచ్చిపోయినా, పాడయి పోయినా వెంటనే తొలగించి కొత్తవి నాటుతున్నాం. పార్కుకు వచ్చేవారు ఔషధ మొక్కల గురించి తెలుసుకునే విధంగా బోర్డులు పెట్టాం. పిల్లలు ఆడుకునేందుకు వినూత్న ఏర్పాట్లు చేశాం.

- బాలయ్య, హార్టికల్చర్ అధికారి

భారత్‌తో కలిసి పరిశోధన భాగస్వామ్యం

డిప్యూటీ బ్రిటిష్ హై కమిషనర్ గారెత్ ఓవెన్



బంజారాహిల్స్ లోని హోటల్‌లో పాల్గొన్న డిప్యూటీ బ్రిటిష్ హైకమిషనర్ గారెత్ ఓవెన్, తదితరులు

బంజారాహిల్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యా, ఆరోగ్య సంరక్షణ సహకారాల్లో యూకే, భారత్ మధ్య ఘన చరిత్ర ఉందని డిప్యూటీ బ్రిటిష్ హైకమిషనర్ గారెత్ ఓవెన్ అన్నారు. లివర్‌పూల్ విశ్వవిద్యాలయం, ఫెర్నాండెజ్ ఆసుపత్రి ఎడ్యుకేషన్, రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొట్టమొదటి భారత్-యూకే పరిశోధన భాగస్వామ్య సమావేశం గురువారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గారెత్ ఓవెన్ మాట్లాడుతూ భారత్‌తో ప్రభావవంతమైన పరిశోధన సహకారాలను పెంపొందించడంలో యూకే నిబద్ధతతో వ్యవహరిస్తుందన్నారు. వైద్యవిద్య ద్వారా తల్లులు, నవజాత శిశువుల సంరక్షణను మెరుగుపరచాలనే ఆశయానికి ఈ భాగస్వామ్య సమావేశం నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ తంగరతినం మాట్లాడుతూ ఈ భాగస్వామ్యాలు శాస్ర్తీయ పరిశోధనలను వాస్తవ ప్రపంచ మెరుగుదలతో అనుసంధానించడానికి సహాయపడతాయన్నారు. మహిళలు నివసించే ప్రదేశం, వారి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణ పొందేలా చూసుకోవడానికి ఈ పరిశోధనలు తోడ్పాటును అందిస్తాయన్నారు. ఫెర్నాండెజ్ ఫౌండేషన్ మిడ్‌వైఫరీ డైరెక్టర్ ఇండికౌర్ మాట్లాడుతూ సురక్షితమైన, అధిక-నాణ్యత గల ప్రసూతి సంరక్షణను నిర్ధారించడంలో మిడ్ వైఫరీ నేతృత్వంలోని సంరక్షణ నమూనాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్, యునిసెఫ్(ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ) ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ జెలాలెం బిరాను టాఫెస్సే, ఫెర్నాండెజ్ ఇన్నోవేషన్స్ ఫోరం చైర్‌పర్సన్ డాక్టర్ ఆంథోనీ విపిన్ దాస్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, తెలంగాణ ప్రభుత్వ ప్రసూతి, శిశు ఆరోగ్యం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు యూఎస్‌ఏ స్టడీ ఎక్స్‌పో

బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో నేడు అమెరికాలోని పలు యూనివర్సిటీల ద్వారా విద్యార్థులకు అందే విద్య, ఉపాధి అవకాశాలపై స్టడీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ ట్రీ సంస్థ ఫౌండర్ ఆలపాటి శుభకర్ తెలిపారు. ఈ ఎక్స్‌పోలో అమెరికాలో ప్రఖ్యాతి గాంచిన యూనివర్సిటీ ప్రతినిధులతో పాటు ఇమ్మిగ్రేషన్, వీసాకు సంబంధించిన పలు కీలక విషయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఒక గంట పాటు యూఎస్ కాన్సులేట్ అధికారులతో ఎడ్యుకేషన్, వీసా పాలసీలపై సమావేశం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



పార్క్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కేపీఎల్‌ఎన్‌పై పార్క్‌లో బార్ రాడ్ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, వ్యాయామం కూడా అవసరమని, కానీ చాలా మంది వీటికి దూరమవుతున్నారని కెపీఎల్‌ఎన్‌వై పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్ అన్నారు. కెపీఎల్‌ఎన్‌వై పార్క్‌లో గురువారం ఉదయం పిల్లల ఆటస్థలంలో కొత్తగా ఏర్పాటు చేసిన బార్ రాడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు ఈ పార్క్‌లో ఆటలతోపాటు వ్యాయామం చేయడం అనువుగా ఉందన్నారు. ప్రతి పార్క్‌లో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

ఖైరతాబాద్, జనవరి30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను వాడుకొని పట్టించుకోకుండా వదిలేసిందని, ప్రస్తుత ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కోరింది. చింతలబస్తీలో జరిగిన సమావేశంలో తెలంగాణ జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ కళాకారులను, ఉద్యమకారులను వీలైనంతవరకు వాడి అన్యాయానికి గురుచేసిందని మండి పడ్డారు. ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రతినెలా రూ.30 వేల పెన్షన్, 250 గజాల స్థలంలో నాలుగు గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలని, గుర్తింపు కార్డులను మంజూరు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలీకుమారి, ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, గంగిరాజు, రాజయ్య, శంకర్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ షెడ్డు..

కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది



పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో అక్రమంగా వేసిన షెడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్డును షేక్‌పేట రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. జూబ్లీహిల్స్‌లోని పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో సర్వే నంబరు 403/పీ లో ప్రభుత్వ స్థలం ఉంది. అందులో స్థానికంగా ఉండే డొక్కా ఉమా అనే మహిళ 180 గజాల స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మించారని షేక్‌పేట రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. తహసీల్దార్ అనితారెడ్డి పరిశీలించి అక్రమ నిర్మాణమని తేలడంతో బుల్‌డోజర్‌తో కూల్చివేతలు నిర్వహించారు. అక్కడ ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు.

మస్తాన్‌నగర్‌లో..

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 46 మస్తాన్‌నగర్‌లో అశోక్ అనే వ్యక్తి ప్రభుత్వానికి చెందిన కొండను కొట్టి ప్రైవేటు ప్లాట్ కింద మార్చి, అమ్మకానికి ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పనులు ఆపించారు. అనంతరం అశోక్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



స్వయంభూ నాగలింగేశ్వర దేవస్థానం ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్, దామోదర్, తదితరులు

ప్రసిద్ధ శైవ క్షేత్రంగా స్వయంభూ రామలింగేశ్వరాలయం

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

ఖైరతాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్వయంభువుగా వెలసి చెట్టు కింద పూజలందుకుంటున్న శివలింగానికి రూ.3 కోట్ల నిధులతో బ్రహ్మాండమైన ఆలయాన్ని నిర్మించిన ధన్యజీవి కోలేటి దామోదర్ అని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. గురువారం వాసవీ సేవాకేంద్రం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ వాసవీ సమావేశ మందిరంలో పెద్దపల్లి జిల్లా రాగినేడు గ్రామంలోని స్వయంభూ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తయారైన ప్రత్యేక సంచిక ప్రారంభోత్సవ కార్యక్రమం వైశ్య ప్రముఖుల మధ్య ఆడంబరంగా జరిగింది. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ, ఓ రైతు వ్యవసాయ పనులు చేస్తుండగా లభించిన శివలింగం గతంలో రాగి, వేప చెట్ల కింద పూజలందుకునేదని తెలిపారు. దానికోసం ఓ దళిత రైతు తనకున్న 2 ఎకరాలలో అర ఎకరాన్ని దేవాలయానికి ఇవ్వగా అందులో తన రూ.2కోట్లతో పాటు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన కోటి రూపాయలతో నవగ్రహ, ఆంజనేయ, సాయిబాబా సహిత రామలింగేశ్వర ఆలయాన్ని నిర్మించారు. ఏడాదిలోనే అది వేలాది మంది భక్తుల కొంగు బంగారంగా మారిందని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, కోలేటి దామోదర్, టూరిజం శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, వాసవీ ఆస్పత్రి ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, వాసవీ సేవా కేంద్రం అధ్యక్షుడు కొల్పూరు రమేష్, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాకర్, వైశ్య ప్రముఖులు మలిపెద్ది శంకర్, జీవిజె రాజు, సంచిక రచయిత చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్‌గా మల్లికార్జున్



బాధ్యతలు చేపడుతున్న కొండ్లె మల్లికార్జున్

ఖైరతాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యాకుత్‌పురా, బ్రాహ్మణవాడి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఏకైక ట్రస్టీగా, చైర్మన్‌గా వాసవీ ఆస్పత్రి ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నేత కొండ్లె మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆయన దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.కృష్ణ ప్రసాద్ ద్వారా ఉత్తర్వులు అందుకొని ప్రమాణ స్వీకారం చేశారు.

గోర్‌బోలి భాషను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలి



అభివాదం చేస్తున్న ఆలిండియా బంజారాసేవా సంఘ్ ప్రతినిధులు

పంజాగుట్ట, జనవరి30(ఆంధ్రజ్యోతి): బంజారాల భాషగోర్ బోలి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో న్యాయ చిక్కులు లేకుండా రాజ్యాంగం ద్వారా చేర్చాలని ఆల్ ఇండియా బంజారాసేవాసంఘ్ (ఏఐబీఎస్‌ఎస్)డిమాండ్ చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏఐబీఎస్‌ఎస్ 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రవీంద్ర నాయక్ మాట్లాడుతూ బంజారాల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ సంఘం ఏర్పడిందని అన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఒకే జాబితాలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 78 సంవత్సరాల పూర్తయినా బంజారాల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ఢిల్లీలో గానీ, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో 150 ఎకరాల భూమిని ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, డాక్టర్ టీసీ రాథోడ్, డాక్టర్ రమేష్ ఆర్య, రామారావు, బి. ధనుంజయ నాయక్, రాంచంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో గంజాయి చాక్లెట్ల పట్టివేత




పట్టుబడ్డ గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ నుంచి కూకట్‌పల్లికి గంజా యి చాకెట్లను సరఫరా చేస్తుండగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ పోలీసులు భారీగా 24 కిలోల గంజాయి చాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గోరక్ సహా రాజస్థాన్ నుంచి గురువారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగాడు. అంతలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చాకచక్యంగా గోరక్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద రూ.2లక్షల విలువ చేసే 24 కిలోల గంజాయి చాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలో టీకొట్టు దగ్గర గంజాయి చాకెట్లను అమ్ముతున్నట్లు ఒక్కొక్క చాక్లెట్ రూ 40కి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు 120 గంజాయి చాకెట్ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించామని అధికారులు తెలిపారు.



ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కస్తూర్బా డిగ్రీ విద్యార్థులు

గిన్నిస్ రికార్డ్ సాధించిన 'కస్తూర్బా' విద్యార్థులు

మారేడుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ నెల 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవం వేడుకలకు మారేడుపల్లి, కస్తూర్బా గాంధీ కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ఎన్‌సీసీ మేజర్ జయసుధ, టీం డైరెక్టర్స్ శ్రీధర్, నాగార్జున ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ మహిళా కళాశాల విద్యార్థినులు ఢిల్లీలో జయంతి జయ మామ అనే కార్యక్రమం ఇండియా గేట్ కర్తవ్యపథ్‌లో పాల్గొని అభినయ సుధా కళాభారతి తరఫున లంబాడి నృత్య ప్రదర్శన చేసి ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. గణతంత్ర వేడుకలకు గాను గత డిసెంబర్ నెల 26వ తేదీన ఢిల్లీకి వెళ్లిన విద్యార్థులు జనవరి 26వ తేదికి తిరిగి వచ్చారు. ఈ మేరకు గురువారం కళాశాలలో కమిటీ ప్రతినిధులు ఛైర్మన్ నోత్తమరెడ్డి, సెక్రటరీ ఫహీముద్దీన్, ట్రెజరర్ సురేష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ, ఎన్‌సీసీ మేజర్ డాక్టర్ జయసుధలు విద్యార్థులను సత్కరించి అభినందించారు.



1979 నాటి 'పది' విద్యార్థుల కలయిక

హైదరాబాద్ సిటీ, జనవరి30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జహనుమాలో సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ స్కూల్‌లో 1979లో పదో తరగతి చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. 45ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన వీరంతా వివిధ హోదాల్లో స్థిరపడగా.. పూర్వ విద్యార్థులు సమ్మేళనం నగరంలోని టూరిజం ప్లాజాలో నిర్వహించారు. తమ అనుభవాలను పంచుకున్నారు. పాఠశాల రోజులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. డ్యాన్స్‌లు చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. పూర్వ విద్యార్థులైనా హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధన్ మోహన్ సింగ్, గిరిధర్‌లు సమ్మేళనంలో కీలకంగా వ్యవహరించడంలో అందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జానకిరామరాజు, గిరిధర్, ఆనంద్‌రెడ్డి, జోజి, ఏవీఎస్ ప్రకాష్, మరో 24మంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ నియోజక వర్గం మారేడుపల్లికి చెందిన రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సీఎం రిలీఫ్ ఫండ్ కింద పత్రాన్ని మహిళ భర్తకు గురువారం ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. వైద్య ఖర్చులకు రూ.లక్ష మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు.

కాజీపేట్‌లో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయండి

రైల్వే డీఆర్‌ఎంను కలిసిన వరంగల్ ఎంపీ కావ్య



రైల్వే డీఆర్‌ఎం భరతేష్ ను కలిసిన వరంగల్ ఎంపీ కావ్య

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట్‌లో కొత్త ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేయాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్‌ను గురు వారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో కలిసి వినతి పత్రం సమర్పించామని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాజీపేట్ ఆవరణలో ఆర్టీసీ బస్టాండు కోసం ఇటీవల స్థలం పరిశీలించామని చెప్పారు. ఇక్కడ బస్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. బస్టాండ్ నిర్మాణానికి కాజీపేట్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఎకరం రైల్వే భూమిని టీఎస్ఆర్‌టిసికి కేటాయించాలని కోరామన్నారు. అందుకు డీఆర్‌ఎం వెంటనే స్పందించి ప్రతిపాదనను రైల్వే బోర్డుకు పంపిస్తానని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.



కళాశాలలో స్వచ్ఛ హైదరాబాద్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ప్లాస్టిక్ వినియోగం ప్రకృతికి నష్టం

బేగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను అధికంగా వినియోగించడం వల్ల ప్రకృతికి నష్టం జరుగుతుందని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పద్మావతి అన్నారు. గురువారం కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ప్రకృతికి నష్టం చేయడంతో పాటు ఓజోన్ పొర దెబ్బతిని జీవరాసి మనుగడకు ముప్పు ఏర్పడే ప్రమాదముందన్నారు. జీహెచ్‌ఎంసి పారిశుధ్య అధికారులతో పాటు కళాశాల ఎన్.ఎస్ఎస్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీహెచ్‌ఓ సక్కుబాయికి సత్కారం

పద్మారావునగర్, జనవరి30(ఆంధ్రజ్యోతి: సీతాఫల్‌మండి క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్. సక్కుబాయి పదవీ విరమణను పురస్కరించుకొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్‌పిహెచ్‌ఓగా సక్కుబాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పి.శ్రీధర్‌బాబు, డీపీఎంఓ రమేశనాయక్, వైద్య అధికారులు సౌజన్య,రాజ్‌కుమార్ వివిధ ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సంజయ్‌గాంధీనగర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కంది‌శైలజ, సుంకు రామచందర్



మారేడుపల్లిలో... పికెట్ గాంధీ హట్స్ బస్తీలో



రాంగోపాల్‌పేట్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ...

గాంధీజీకి ఘన నివాళులు



మంత్రుల నివాసంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు



గాంధీ ఆస్పత్రి ఆవరణలోని విగ్రహానికి నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ రాజకుమారి

బౌద్ధనగర్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో గురువారం మహాత్మాగాంధీ వర్థంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చిలకలగూడలో గాంధీ విగ్రహానికి సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ పూలమాలల వేసి నివాళులర్పించిన అనంతరం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు నేరవేర్చలేదని మండిపడ్డారు. అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మీ, నాయకులు కరాటేరాజు తదితరులు పాల్గొన్నారు. జామైఉస్మానియా సంజయ్‌గాంధీనగర్‌లో, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ, బీఆర్‌ఎస్ యువనాయకుడు సుంకు రామచందర్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ యువనేతలు మేకల హర్షకిరణ్, కిర్తీ తదితరులు సంజయ్‌గాంధీనగర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు.

మారేడుపల్లి: పికెట్ గాంధీ హట్స్ బస్తీలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.వెంకటేష్, సదానంద్, బాబురావు, వందన, బస్తీ మెంబర్స్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సనత్‌గర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు అతెల్లి అరుణ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట: గాంధీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ1 డాక్టర్ శేషాద్రి పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో అడ్డగుట్టలో ఉన్న గాంధీ విగ్రహానికి నివాళుర్పించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు.

తిరుమలగిరి: తిరుమలగిరి చిన్నమ్మతోటలోని గాంధీ విగ్రహానికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ క్రిషాంక్ నివాళులు అర్పించారు. అనంతరం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు-7 మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్, యశ్వంత్ కుమార్, జంగిల్ రాజ్, రావుల సతీష్, సత్యనారాయణ గౌడ్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ సామల హేమ



గాంధీ ఆస్పత్రి ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీఆర్‌ఎస్‌వీ కార్యకర్తలు



వివిధ డిక్లరేషన్ల ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ క్రిషాంక్

'వికసిత భారత్' సాకారానికి ప్రోత్సాహం అవసరం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



దివ్యాంగులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ బి.వి.రామ్‌కుమార్

బోయిన్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి భారతం (వికసిత భారత్) కలల సాకారానికి యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన స్పెషల్ ఎంప్లాయిస్ నేషనల్ మీట్ ముగింపు వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థ డైరెక్టర్ బి.వి.రాంకుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు దివ్యాంగస్ విద్యార్థులకు బ్యాటరీ వీల్‌చైర్లు, టిఎల్‌ఎం కిట్లు, వినికిడి యంత్రాలు అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. సామాన్య పౌరులకు దీటుగా దివ్యాంగులను అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి వారు సాధికారత సాధించేందుకు ఎన్ఐఈపిఐడి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దివ్యాంగులు తమ ప్రత్యేకతలను చాటుకునేందుకు ఇలాంటి జాతీయ సదస్సులను నిర్వహిస్తుండడం సంతోషకరమని అన్నారు. ఎన్ఐఈపిఐడి దివ్యాంగుల సంక్షేమార్థం యుడిఐడి గుర్తింపు కార్డులు, మెరుగైన వైద్యం కోసం నిరామయ ఆరోగ్య కార్డులు, పీఎం దక్షా లాంటి పథకాలను ప్రవేశపెట్టడం శుభపరిణామమన్నారు. స్వయంగా తయారుచేసిన వస్తువులను ప్రదర్శించడమే కాకుండా ఉద్యోగ అవకాశాలను పొందడానికి ఈ సదస్సులో దేశ నలుమూలల్లోని 11 రాష్ట్రాలకు చెందిన 150 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. వీరికి ఉద్యోగావకాశాలను కల్పించేందుకు 16 సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సంస్థ డైరెక్టర్ బి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ, దివ్యాంగులకు ఉపాధిని కల్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు వివిధ సంస్థలు ముందుకు వస్తుండడం శుభసూచికమన్నారు. అలాంటి సంస్థల్లో ఆలిమ్కి, ఆశా, ఎన్‌టిపిసి, యూత్ ఫర్ జాబ్స్, వాసవీ క్లబ్, ఫినోమ్, ఐటీసీ, లయన్స్ క్లబ్ వంటి ప్రఖ్యాతిగాంచిన సంస్థల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నిపిడ్ దయల్ విభాగాధిపతి శ్రీనివాస్, శ్రావణ్, ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ల అరెస్ట్ ప్రజాస్వామ్య విరుద్ధం : ఎమ్మెల్యే తలసాని



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్

రాంగోపాల్‌పేట్, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జీహెచ్‌ఎంసీ బడ్జెట్ సమావేశాలలో సమస్యలపై ప్రశ్నించిన దాదాపు 30 మందికిపైగా బిఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేసి రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్‌కు చేరుకొని కార్పొరేటర్లకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ బడ్జెట్ సమావేశంలో గత బడ్జెట్‌లో ప్రకటించిన నిధుల ఖర్చు వివరాలను కోరినందునే మా కార్పొరేటర్లను అక్రమంగా అరెస్టు చేశారని, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమ కార్పొరేటర్లను బయటకు పంపి బడ్జెట్ ఆమోదించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద, నాయకులు శ్రీహరి, కొశికె కిషోర్, ఆరిఫ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, నర్సింగం సతీష్, ఆంజనేయులు తదితరులు తలసాని వెంట ఉన్నారు.

వైద్య సేవలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

మారేడుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సకాలంలో వైద్యం అందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో బేగంపేట, అమీర్ పేట డివిజన్‌లకు చెందిన 13 మంది లబ్ధిదారులకు 3.93 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, నామన సంతోష్ కుమార్, శ్రీహరి, కిషోర్, కర్నాకర్ రెడ్డి, కూతురు నర్సింహ, శేఖర్, గోపిలాల్ చౌహాన్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు



బోయిన్‌పల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న జంపన్న ప్రతాప్

బోయిన్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం 23వ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల గోడపత్రికలు, కరపత్రాల విడుదల కార్యక్రమం గురువారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, ఆలయ ముఖ్య సలహాదారు జంపన్న ప్రతాప్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి విలేకరుల సమక్షంలో విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ, ఫిబ్రవరి 10 నుండి 15 వరకు వెంకటేశ్వర స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. ఆరురోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దేవుని కృపకు, ఆశీస్సులు కావాలని అన్నారు. విరాళాలు అందించాలన్న భక్తులు నేరుగా దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామ్మోహన్ రావు, లక్ష్మణ్, ఆత్మానందరెడ్డి, పోకూరి మోహన్‌రావు, జగన్నాధం, యాదయ్య, నర్సింగ్‌రావు, పెంటారెడ్డి, ధర్మవీర్, స్థానికులు బండి శ్రీనివాస్, కారంపూడి నారాయణ, ప్రధాన అర్చకులు పవన్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యం



ముఖ్య అతిథి మూర్తితో నృత్య కళాకారులు

హరిహరకళాభవన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మహిత ఆర్ట్స్ అకాడమీ 30వ వార్షికోత్సవం సికింద్రాబాద్ హరిహరకళాభవన్‌లో బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ చిత్రకారుడు బి.యస్. మూర్తి మాట్లాడుతూ, కళలతో మానసిక వత్తిడి దూరమై, ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. మూడు దశాబ్దాలుగా కూచిపూడి నాట్య కళాకారులను తీర్చిదిద్దడంలో అకాడమీ వ్యవస్థాపకురాలు కె.శిరీష కృషిని కొనియాడారు. గాయకుడు శ్రీ.విజయ తీర్థ తన త్రిగళం (ఆడ,మగ, పిల్లల) గొంతుతో మధుర గానం చేసి అలరించగా ఆయనను విస్మయ గళ గాయక బిరుదుతో సత్కరించారు. చిన్నారులు సృజన. శ్రియ. శశిర, ఆద్య, తనిష్కలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం లో ప్రత్యేక అతిధులుగా టాస్క్ ఫోర్స్ డిసిపి తదితరులు హాజరయ్యారు

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గురువారం వృద్ధుడు చనిపోయి ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కుష్టు వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారీ

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. లెప్రసీ డే సందర్భంగా గురువారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ ఆధ్వర్యంలో ప్లకార్డులు, బ్యానర్లతో ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ డెర్మటాలజీ వైద్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

రెజిమెంటల్‌బజార్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యుడిగా ఉండి మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సొసైటీ అండగా నిలిచింది. సొసైటీలో షేర్ హోల్డర్‌గా ఉన్న పరమేశ్వర్ రావు రెండు నెలల క్రితం మృతి చెందారు. సొసైటీ తరఫున మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించి అతను కుటుంబానికి ఆసరాగా ఉండాలని గురువారం సొసైటీ సికింద్రాబాద్ కార్యాలయంలో అతని భార్య భార్గవికి రూ.4,76,272 చెక్కును సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి అందజేశారు. సొసైటీ నుండి తీసుకున్న జనరల్,స్పెషల్ లోన్లు కూడా మాఫీ చేసినట్లు తెలిపారు.



జేబీఎస్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం

మారేడుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాగాయకుడు గద్దర్ పద్మ భూషణ్‌కు అర్హుడు కాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శిస్తూ అభ్యంతరం తెలపడంతో కంటోన్మెంట్ కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలరాజ్ యాదవ్ అధ్వర్యంలో జేబీఎస్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేష్, సదానంద్, హరికృష్ణ, సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బడిలో నిర్వహించిన జెండర్ కమిటీ సమావేశంలో విద్యార్థులు

ప్రభుత్వ బడిలో జెండర్ కమిటీ సమావేశం

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు జెండర్ కమిటీ ఏర్పాటు చేశామని ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి సువర్ణ అన్నారు. గురువారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే జెండర్ కమిటీ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి బడిలో ప్రతి క్లాసుకు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కమిటీలో ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. పాఠశాలల స్త్రీ పురుషుల్లో ఉన్న తారతమ్య బేధాలు సామాజిక పరంగా నిర్ధారించబడతాయో ఆ నిర్ధారణ ప్రక్రియనే జెండర్ లక్షణాలుగా పరగణించాల్సి ఉంటుందన్నారు. జెండర్ పరంగా ఉన్న విద్యార్థులు కట్టుబాట్లు ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక హక్కుల కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.